

నాలా స్లాబ్‌కు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

ఎట్టకేలకు నాలా స్లాబ్‌కు మరమ్మతులు

● ఆంధ్రజ్యోతి కథనంతో అధికారుల్లో చలనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మన్సూరాబాద్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మన్సూరాబాద్ డివిజన్ శ్రీసాయినగర్‌కాలనీ రోడ్ నంబరు 2లో కూలిన నాలా స్లాబ్ పనులు ఆంధ్రజ్యోతి కథనంతో శనివారం ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఇరవై రోజులుగా నెలకొన్న సమస్యను స్థానికులు పలుమార్లు సంబంధిత జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. 'నాలాస్లాబ్ ధ్వంసం.. రాకపోకల్లో నరకం' అనే శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి శనివారం పనులు ప్రారంభించారు. దీంతో శ్రీసాయినగర్‌కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.



లెప్రసీ వ్యాధిగ్రస్థులకు నిత్యావసరాలను అందజేస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీరాజు

లెప్రసీ బాధితులకు అండగా ఉందాం

● పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీరాజు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): లెప్రసీ వ్యాధిగ్రస్థులకు అండగా నిలబడుదాం అని పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పండుగుల జయశ్రీరాజు అన్నారు. శనివారం గ్రేస్ సర్వీస్ సొసైటీ ఖమ్మం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్, సంతోషనగర్ కాలనీలోని 150 లెప్రసీ కుటుంబాలకు బియ్యం, దుప్పట్లు, చీరలు, షర్టులను చైర్‌పర్సన్ జయశ్రీరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులను ఆదుకునేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. 150 కుటుంబాలకు నిత్యావసరాలను అందించడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను అబినందించారు. లెప్రసీ కాలనీల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో గ్రేస్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు జాకోబ్, స్లాప్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. రమేష్, సామేల్, రహిమతుల్లా, మల్లయ్య, పెంటయ్య, రాములు, అజీజ్ పాల్గొన్నారు.

వైభవంగా మహాలింగార్చన

మన్సూరాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): వేద హవనం సహిత గజేంద్రమో క్ష ప్రవచన పాంచాహ్నిక జ్ఞాన యజ్ఞ మహోత్సవాల్లో భాగంగా శనివారం మహాలింగార్చన, రుద్రాక్షాభిషేకాలు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. నాగోల్ డివిజన్ జనప్రియ ఎన్‌క్లేవ్ పార్కులో జనప్రియ ఎన్‌క్లేవ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ప్రోత్సాహంతో జరుగుతున్న ఈ వేడుకల్లో స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలైన చాణక్యపురికాలనీ, రాక్‌టౌన్‌కాలనీ, రాక్‌హిల్స్‌కాలనీ, సాయినగర్ ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భద్రాచల ఆస్థాన వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యుల ప్రవచనాలు భక్తులను తరింపజేశాయి.

అయ్యప్ప పడిపూజ

సరూర్‌నగర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడలోని మిథిలానగర్ కాలనీలో శనివారం 16వ డివిజన్ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్‌యాదవ్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహా 25వ మెట్టు పడిపూజోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, మీర్‌పేట్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, పలు పార్టీల నాయకులు, భక్తులు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



మల్‌రెడ్డి రాంరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఆటో డ్రైవర్లు

ఐఎస్‌సదన్ వరకు ఆటోలను అనుమతించాలి

దిల్‌సుఖ్‌నగర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఐఎస్ సదన్ వరకు ప్యాసింజర్ ఆటోలను అనుమతించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ ఆటోడ్రైవర్లు శనివారం రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. బీఎన్‌రెడ్డినగర్, ఎల్బీనగర్‌ల నుంచి ఐఎస్ సదన్ వరకు ప్రతి నిత్యం ఆటోలను నడుపుతూ జీవనోపాధిగడిస్తున్న సుమారు 300 మంది ఆటోవాలాలు మల్‌రెడ్డి రాంరెడ్డిని కలిశారు. మూడు రోజులుగా ట్రాఫిక్ పోలీసులు తమ ఆటోలను ఐఎస్‌సదన్‌కు వెళ్లనీయకుండా చంపాపేట ఎస్ఎన్‌రెడ్డి గార్డెన్ వద్దనే నిలిపివేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. దీని మూలంగా మూడు రోజులుగా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో పూటగడవడం కష్టంగా మారిందని ఆవేదన వెలిబుచ్చారు. తిరిగి ఐఎస్‌సదన్ వరకు ఆటోల రాకపోకలు కొనసాగేలా చర్యలు చేపట్టాలని విన్నవించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మల్‌రెడ్డి రాంరెడ్డి వెంటనే ట్రాఫిక్ ఉన్నతాధికారులతో ఫోన్‌లో చర్చించారు. త్వరితగతిన ఐఎస్‌సదన్ వరకు ఆటోలను అనుమతించాలని సూచించారు.

మహాసభలకు తరలిన సీపీఎం శ్రేణులు



జిల్లా మహాసభలకు తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు

ఎల్బీనగర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం లో శని, ఆదివారాలలో జరుగుతున్న సీపీఎం జిల్లా మహాసభల్లో పాల్గొనేందుకు ఆర్‌కేపురం డివిజన్ ఎన్‌టీఆర్‌నగర్ నుంచి సరూర్‌నగర్ సర్కిల్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ మహాసభల్లో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నామని పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు చంద్రమోహన్ తెలిపారు. మహాసభలకు తరలివెళ్లిన వారిలో చంద్రమోహన్‌తో పాటు సీపీఎం సరూర్‌నగర్ కార్యదర్శి సీహెచ్ వెంకన్న, సర్కిల్ కార్యవర్గసభ్యులు కట్ట శ్రీనివాస్, ఎం.గోపీనాయక్, వీరయ్య, రాములు, యాదయ్య, చైతన్య ఉన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తాం

హయత్‌నగర్ : దేశ వ్యాప్తంగా సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ బొమ్మరబోయిన కేశవులు అన్నారు. శనివారం హయత్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా కార్యక్రమాలు నిర్వహించి ఓటర్లలో చైతన్యం తీసుకువస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో అక్రమాలను నిరోధించడానికి సి- విజిల్ యాప్ వినియోగాన్ని పెంచడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా గ్రామీణ ఓటర్లను చైతన్య పరిచి సరైన నాయకుడిని ఎన్నుకునేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా సమాచార హక్కు పరిరక్షణ సమితి కో-ఆర్డినేటర్‌గా కల్వాల హరికృష్ణను నియమించారు. మండల పంచాయతీ ఆఫీసర్ మధుసూదనాచారి, ఎస్ఐ సైదులు, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, పల్లె శివాజీ గౌడ్, మధు, నాగార్జున, యాదగిరి. యాకు పాషా, పండు, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

జెండర్ అనేది మనసుకు సంబంధించినది

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆడ, మగ అనేవి భౌతికపరమైన అంశాలు కావని మనసుకు సంబంధించినవని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి అన్నారు. ట్రాన్స్‌జెండర్ల సమస్యలు, హక్కులు అనే అంశంపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కోర్టులో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష ఇప్పటి వరకు మహిళలపైనే కొనసాగిందని ఇప్పుడు ట్రాన్స్‌జెండర్లు కూడా ఈ జాబితాలో చేరిపోయారన్నారు. వివక్షను చట్టాలెప్పుడూ సమర్థించవన్నారు. ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణకు ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ యాక్టు ఏర్పాటయిందన్నారు. అనంతరం మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభిరామారావు ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ యాక్టు గురించి వివరించారు. క్యూటీ సెంటర్ నిర్వాహకులు ఆదిత్య మాట్లాడుతూ జెండర్ అనేది క్రోమోజోములు, హార్మోనల్ ఇంబాలెన్స్‌కి కూడా సంబంధించినది కాదన్నారు. రచన, వైజయంతి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లకు కర్ణాటకలో మాదిరిగా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ప్రత్యేక హౌసింగ్ కాలనీలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పొన్న శ్రీదేవి, అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, కార్యదర్శి కృష్ణ, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా కృషి చేయాలి



నషాముక్త్ భారత్ అభియాన్ మాస్టర్ వలంటీర్ల శిక్షణ శిబిరంలో ఎస్ఎల్‌సీఏ డైరెక్టర్ కోమలి తదితరులు

ఎల్బీనగర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా మాస్టర్ వలంటీర్లు కృషి చేయాలని స్టేట్ లెవల్ కోఆర్డినేటింగ్ ఏజెన్సీ(ఎస్ఎల్‌సీఏ) డైరెక్టర్ కోమలి సూచించారు. స్టేట్ లెవల్ కోఆర్డినేటింగ్ ఏజెన్సీ, న్యూ హోప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నషాముక్త్ భారత్ అభియాన్ మాస్టర్ వలంటీర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో సరూర్‌నగర్‌లోని రంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలోని మహిళా సాధికార కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోమలి మాట్లాడుతూ తాగుడుకు బానిసలైన వారిని ఓ అడిక్షన్ సెంటర్‌లో చేర్పించి వారు మాదకద్రవ్య వ్యసనం నుంచి బయట పడేలా చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి సీహెచ్ సంధ్యారాణి మాస్టర్ వలంటీర్ల పాత్ర, ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీశైలం, సైకాలజిస్ట్ శ్రీనివాస్, ట్రైనర్ శ్రీశైలం పాల్గొన్నారు.

డయల్‘100’కు ధైర్యంగా ఫోన్ చేయాలి

● ఎస్ఓటీ ఎస్ఐ రాములునాయక్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఓటీ పోలీసులు

హయత్‌నగర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం రాచకొండ ఎస్ఓటీ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఓటీ ఎస్ఐ రాములునాయక్, మహిళా ఏఎస్ఐ అనురాధలు హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే మానవ అక్రమ రవాణాలో భారతదేశం మూడో స్థానంలో ఉందని తెలిపారు. బాల కార్మికులు, మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, చిన్న పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలు, బలవంతంపు వ్యభిచారం, ఇతర దేశాలకు అమ్మివేయడం, సైబర్ నేరాలు, ర్యాగింగ్, రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలు ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు ఏదైన అనుమానం కలిగితే 100కు ఫోన్ చేయాలని కోరారు. సైబర్ నేరాలకు గురి అయితే 1930కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ పెంటారెడ్డి, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి

బండ్లగూడ ఖల్సా రైతు సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

సరూర్‌నగర్ : బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో గల బండ్లగూడ ఖల్సా రైతు సొసైటీ ఆధ్వర్యంలో ముద్రించిన నూత న సంవత్సరం-2025 క్యాలెండర్‌తో పాటు డైరీని శనివారం సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి, వైస్ చైర్మన్ కొలన్ తిరుపతిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తోపుడు బండ్లు పంపిణీ

మన్సూరాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ రాక్‌హిల్స్ కాలనీలోని రైస్ ఏటీఎం వద్ద మిషన్ ప్రిష ఆధ్వర్యంలో శనివారం నిరుపేద మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు తోపుడు బండ్లు, కుట్టుమెషిన్లు, టీస్టాల్స్‌లతో పాటు నిత్యావసర సరుకులు, బియ్యంను సంస్థ నిర్వాహకులు దోసపాటి రాముతో కలిసి యశస్విని పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఉపాధి లేని పేదలకు తమవంతు సహకారంగా ఉపాధి కల్పించడం, తినేందుకు తిండిలేని వారికి నిత్యావసరాలు, బియ్యం పంపిణీ చేసి ఆదుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగడమే కాకుండా తమ కాళ్లపై తాము నిలబడేలా వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, సూర్య, రాఘవ్ తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ క్రికెట్, హోటల్ సముదాయాలను తొలగించాలి

● జనప్రియకాలనీ సంక్షేమ సంఘం



బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను తొలగించాలని నిరసన వ్యక్తం చేస్తున్న జనప్రియకాలనీవాసులు

వనస్థలిపురం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులకు ఇబ్బందికరంగా మారిన బాక్స్‌క్రికెట్, హోటల్ సముదాయాలను తొలగించాలని జనప్రియకాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం బాక్స్ క్రికెట్, హోటల్ సముదాయాల ఎదుట కాలనీవాసులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కాలనీ అధ్యక్షుడు బ్రహ్మచారి, ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ మాట్లాడుతూ కాలనీలోని మహిళలు, వృద్ధులు ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటే కాలనీలోని రోడ్డు నంబరు 1 వద్ద ఇప్పటికే టీ, టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేశారని, ఇక్కడ నూతనంగా ఏర్పాటు చేస్తున్న బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌ను త్వరలోనే ప్రారంభించడానికి సదరు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఇక్కడ నెలకొన్న రద్దీతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయడంతో ఇక్కడ నుంచి వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కాలనీవాసులకు ఇబ్బందులు సృష్టిస్తున్న సదరు వాణిజ్య సముదాయాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం భవనంలో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో సమావేశం ఏర్పాటు చేశారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కాలనీవాసులు ఏడుకొండలు, శ్రీనివాస్‌గుప్తా, నరేంద్ర, కులకర్ణి, నవీన్, కోటేశ్వర్‌రావు, ఠాగూర్, నర్సింహులు పాల్గొన్నారు.

నేత్ర, శరీర, అవయవ దానాలతో మరొకరికి పునర్జన్మ



శరీరదానం చేసేందుకు ముందుకొచ్చిన రాఘవరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

మన్సూరాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): అంధులు, వికలాంగులకు నేత్ర, అవయవ, శరీర దానాలు చేసి వారికి పునర్జన్మ ప్రసాదించేందుకు ప్రజలు ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి.శ్రవణ్‌కుమార్, జీవన్‌ధాన్ సంస్థ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ డాక్టర్ భానుచంద్ర కోరారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మన్సూరాబాద్ డివిజన్ సహారా ఎస్టేట్స్‌కాలనీలోని సీనియర్ సిటిజన్స్ భవనంలో శనివారం నేత్ర, అవయవ, శరీర దానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం తన మరణానంతరం శరీరదానం చేసేందుకు ముందుకు వచ్చిన విశ్రాంత కోర్టు ఉద్యోగి రాఘవరెడ్డిని పలువురు అభినందించారు. అదేవిధంగా బ్రెయిన్‌డెడ్ అయిన ఓ వ్యక్తి అవయవాలు దానం చేసిన కుటుంబ సభ్యులను సన్మానించారు. వాసన్ ఐ బ్యాంక్ మేనేజర్ ఎ.అరవింద్‌కుమార్, సహారా ఎస్టేట్స్ మెయింటనెన్స్ కమిటీ అధ్యక్షుడు సయ్య ద్ జానీ, ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, కార్యదర్శి విశ్వనాథం, కోశాధికారి ప్రకాశ్, కాలనీవాసులు కరణం శ్రీకాంత్, శీనయ్య, రామన్‌గౌడ్, డాక్టర్ వెంకటేశ్వర్లు, నర్సింహగౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం పడి కూలీకి స్వల్పగాయాలు

● 3 బైకులు, ఒక ఆటో ధ్వంసం



కరెంటు స్తంభం పడడంతో ధ్వంసమైన వాహనాలు

కొత్తపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): కామినేని చౌరస్తాలో ప్రమాదవశాత్తు కరెంట్ స్తంభం విరిగి కిందపడిపోయిన ఘటనలో ఓ కూలీకి స్వల్పగాయాలయ్యాయి. సమీపంలో నిలిపి ఉంచిన 3 బైకులు, ఒక ఆటో ధ్వంసమయ్యాయి. శనివారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్బీనగర్ విద్యుత్‌శాఖ అధికారులు ఈ ఘటనపై వివరాలు చెప్పడానికి నిరాకరించారు. అసలు వారు స్పందించలేదు. కామినేని చౌరస్తా అభినంద్ గ్రాండ్ హోటల్ వద్ద విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి, 11కేవీ తీగలు లాగే పనులు చేస్తున్నారు. తొలుత పక్కనే ఉన్న చెట్టు కొమ్మలు కొట్టేశారు. చెట్టు కొమ్మ వైర్లపై పడడంతో ప్రమాదవశాత్తు స్తంభం విరిగి వాహనాలపై పడిపోయింది. స్తంభంపై పని చేస్తున్న గణేష్(32) అనే కూలీకి స్వల్పగాయాలయ్యాయి. అతడికి కామినేని ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేశారు. ఈ విషయంపై సంబంధిత విద్యుత్‌శాఖ వారు స్పందించలేదు. అధికారులు స్పందించకపోవడం దారుణమని ధ్వంసమైన బైకుల యజమానులు బాలకృష్ణ, సురేందర్, ఏడుకొండలు తెలిపారు. బైకులు పార్క్ చేసి పక్కనే గల క్యాంటీన్‌లో టీ తాగిచ్చే సరికి బైకులపై కరెంటు స్తంభం పడి ఉందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఘటన చోటు చేసుకుందని, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా జనం, వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ప్రికాషన్స్ తీసుకోకుండా కరెంటు పోల్‌పై తీగలు లాగే పనులు చేపట్టడంతో స్తంభం విరిగిపడి బైకులు ధ్వంసమై నష్టం జరిగిందన్నారు.



జిల్లెలగూడ చందచెరువు కట్టపై బ్రహ్మేంద్రస్వామి విగ్రహావిష్కరణలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నేతలు శ్రీరాములుయాదవ్, శంకర్‌రెడ్డి

ఘనంగా వీర బ్రహ్మేంద్రస్వామి విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

సరూర్‌నగర్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లెలగూడ చందచెరువు కట్టమీద బ్రహ్మంగారి విగ్రహావిష్కరణ ఉత్సవ సమితి, విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి విగ్రహాన్ని శనివారం అట్టహాసంగా ఆవిష్కరించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అసెంబ్లీ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, మీర్‌పేట్ మేయర్ దుర్గదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బడంగ్‌పేట్ మేయర్ పారిజాతానర్సింహారెడ్డి, టఫ్‌ఐడీసీ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు అందెల శ్రీరాములు యాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు బ్రహ్మంగారి తత్వాల గురించి, ఆయన చెప్పిన కాలజ్ఞానం గురించి మననం చేసుకున్నారు. నిర్వాహకులతో పాటు పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆయా పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

హుక్కా సెంటర్‌పై పోలీసుల దాడి

● ఇద్దరు క్యాషియర్ల అరెస్టు, పరారీలో ఇద్దరు నిర్వాహకులు

మన్సూరాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హుక్కా సెంటర్‌పై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి హుక్కా పైపులు, కుండలు, ఇతర సామగ్రిని స్వాధీనపర్చుకున్న ఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని భవానీకాలనీకి చెందిన సాయికిరణ్‌గౌడ్ నాగోల్ బండ్లగూడలోని శ్రీఇంద్రప్రస్థకాలనీలో బ్లాక్ అండ్ వైట్ కేఫ్‌ను కొంతకాలంగా నిర్వహిస్తున్నాడు. కాగా ఆ కేఫ్‌లో ప్రభుత్వ అనుమతులు ఉల్లంఘిస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా హుక్కా సెంటర్‌ను సైతం నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు నాగోల్ పోలీసులు శుక్రవారం రాత్రి ఆ సెంటర్‌పై దాడిచేసి రఘు, నందన్‌శర్మ అనే ఇద్దరు క్యాషియర్లను అరెస్టు చేసి విచారించగా నాంపల్లికి చెందిన శివప్రసాద్, భవానీకాలనీకి చెందిన సాయికిరణ్‌గౌడ్ అనే ఇద్దరు ఈ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా నిర్వాహకులిద్దరూ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడిలో ఇద్దరు క్యాషియర్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు 25 హుక్కా పైపులు, 12కుండలు, కొబ్బరి బొగ్గు బాక్స్ బ్రికెట్, హుక్కా ఫిల్టర్లు, 3 ప్యాకెట్లు స్వాధీనపర్చుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గంజాయి సేవించిన నలుగురి అరెస్టు

● నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం

మన్సూరాబాద్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గంజాయి సేవించిన నలుగురు యువకులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సూర్యానాయక్ వివరాల ప్రకారం.. నాగోల్ జైపురికాలనీలోని హనుమాన్‌నగర్‌లో నివాసముంటూ చదువుకుంటున్న ఏపీలోని ఒంగోలుకు చెందిన తన్నీరు మహేష్(23), ఆర్కేపురం అలకాపురిలోని రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి ఎండీ అమన్‌ఫరూక్(25), నాగోల్ బండ్లగూడలోని ఆనంద్‌నగర్ రాజీవ్‌గృహకల్పకు చెందిన ఫొటోగ్రాఫర్ బోజి షయాద్‌అలీ(21), తట్టిఅన్నారం గ్రామం జీవీఆర్ కాలనీకి చెందిన డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎట్టా అక్షిత్ రెడ్డి(19)లు స్నేహితులు. వీరు నలుగురు తట్టిఅన్నారం గ్రామంలోని చెరువు వెనకభాగంలో గంజాయి సేవిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లగా వారు పారిపోయేందుకు ప్రయత్నించారు. అనుమానం వచ్చి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ధూల్‌పేట్‌లో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి ఉందని వెళ్లాము కానీ తీసుకురాలేదని తెలిపారు. అయినా అనుమానం వచ్చిన పోలీసులు పీఎస్‌కు తరలించి వారి మూత్ర నమూనాలు తీసుకుని పరీక్షించగా అక్కడ నుంచి గంజాయి తీసుకుని వచ్చి సేవించినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఆటోను ఢీ కొట్టిన కారు.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



కారు ఆటోను ఢీ కొట్టిన దృశ్యం

హయత్‌నగర్ : పార్కు చేసి ఉన్న ఆటోను కారు ఢీకొట్టిన సంఘటనలో ఆటో డ్రైవర్ తీవ్ర గాయాలకు గురైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. అన్మగల్ హయత్‌నగర్‌కు చెందిన యాదయ్య(44) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నా డు. శనివారం మధ్యాహ్నం 1గంట సమయంలో తన ఆటోను హయత్‌నగర్ రాఘవేంద్ర హోటల్ పక్కన విజయవాడ జాతీయ రహదారి పక్కన పార్కు చేసి ఆటోలో కూర్చున్నాడు. అంతలో విజయవాడ వైపు నుంచి వేగంగా హైదరాబాద్ వైపుకు వస్తున్న బెలినో కారు అదుపు తప్పి ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో కుర్చున్న యాదయ్య డోర్‌లో నుంచి ఎగిరి రెండు మీటర్ల దూరంలో పడి తీవ్రగాయాలకు గురి అయ్యాడు. వెంటనే స్థానికులు యాదయ్యను పక్కనే ఉన్న నీలాద్రి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. యాదయ్య ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. కారు ఢీకొనడంతో ఆటో ఐదుమీటర్లు ముందుకు దూసుకుపోయింది. కారులో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

ల్యాబ్ టెక్నీషియన్ ఆత్మహత్య

సైదాబాద్ : ఇంట్లో ఉరేసుకుని ల్యాబ్ టెక్నీషియన్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. జనగామ జిల్లా లింగాల ఘణపురం మండలం కుందారం గ్రామానికి చెందిన ఓరుగంటి మల్లేష్ చిన్న కుమారుడు సింహాద్రి(22) సైదాబాద్ వినయ్‌నగర్‌లోని అభినయ్ మదర్ అండ్ చైల్డ్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. సమీపంలో గది అద్దె తీసుకుని నివాసముంటున్నాడు. శుక్రవారం రాత్రి నుంచి తండ్రి మల్లేష్ పలుమార్లు ఫోన్‌చేయగా లిఫ్ట్ చేయలేదు. తర్వాత ఫోన్ స్విచాఫ్ అయింది. దీంతో శనివారం ఉదయం తండ్రి అనుమానంతో ఆస్పత్రికి ఫోన్‌చేసి విషయాన్ని చెప్పాడు. దీంతో తోటి సిబ్బంది సింహాద్రి గది వద్దకు వెళ్లగా లోపల నుంచి గడియపెట్టి ఉంది. కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కి చున్నీతో ఉరేసుకుని ఉన్నాడు. దీంతో సైదాబాద్ పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు.